AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
21-3-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

## కలుషిత తాగునీటి సరఫరా



2

## క్రీడాకారులకు కిట్ల పంపిణీ



2

## ఘనంగా హనుమాన్ మహా మండలపూజ



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని జ్ఞాన సరస్వతి దేవి ఆలయ ప్రాంగణంలో హనుమాన్ దీక్ష పీఠాధిపతులు దుర్గా ప్రసాద్ స్వామిజీ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి దీక్ష స్వాముల సామూహిక మహా మండలపూజ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆయనతో పాటు పోచారం శంభు రెడ్డి, ప్రేమల దంపతులు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





నిజామాబాద్ నగరంలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

2లో..

## ఘనంగా రంజాన్ వేడుకలు





ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న ప్రభుత్వ సలహాదారు పోచారం, ఎమ్మెల్యే ధన్‌పాల్..

కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో వరదలు సంభవించి అపార నష్టం వాటిల్లింది. గతేడాది ఆగస్టులో భారీ వర్షా లతో జిల్లా అతలాకుతలం అయింది. అనేక రోడ్లు, చెరువులు కొట్టుకు పోయాయి. పలువురు మృతి చెందారు. నష్టం అంచనా వేయడానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బృందాలు పర్యటించాయి. భారీగా నష్టాన్ని అంచనా వేశాయి. వరదలు ముంచెత్తి ఆరు నెలలు గడిచిపోయినా ఇప్పటికి వరద సాయం మాత్రం అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు సాయం ప్రకటిస్తారని ఆశించినా ఫలితం లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి. అలాగే ప్యాకేజీ 21, 22 పనులకు నిధులు కేటాయించలేదు.

- అక్షరటుడే, కామారెడ్డి



# నిధుల జాడేది?

- వరదలతో జిల్లాకు భారీ నష్టం
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- బడ్జెట్‌లో ఊసెత్తని వైనం
- కాళేశ్వరం ప్యాకేజీ 21, 22కు నిధులు కరువు

కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన.. ప్రాజెక్ట్ 21, 22 పనులకు మోక్షం లభించడం లేదు. ఏళ్లు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వం కంటితుడుపు చర్యగా నిధులు కేటాయించి చేతులు దులుపుకుందన్న విమర్శలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల పథకం కావడంతో ఈ ప్రభుత్వంలోనైనా ప్యాకేజి 22 పనులకు నిధులు వస్తాయని భావించినా రెండున్నరేళ్లలో రూ.23 కోట్లు మాత్రమే విడుదల అయ్యాయి.

### వరద సాయం లేనట్టేనా?


గత సంవత్సరం ఆగస్టు 26, 27 తేదీలలో కామారెడ్డి జిల్లాలో అతి భారీ వర్షాలు ప్రజలను ఆగం చేశాయి. కామారెడ్డి పట్టణంలో వరద బీభత్సం సృష్టించింది. పట్టణంలోని జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీలు వరదల్లో చిక్కుకున్నాయి. ఆ కాలనీల్లో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. నియోజకవర్గంలో రహదారులు ఛిద్రమయ్యాయి. రోడ్లు కొట్టుకుపోయాయి. జనజీవనం స్తంభించింది. వేలాది ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. వేలాది పశువులు కొట్టుకుపోయాయి. ఆరుగురు మృత్యువాత పడ్డారు. అయితే ఇప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వరద సాయం ప్రకటించలేదు. అసెంబ్లీ సందర్భంగా బడ్జెట్‌లో వరద సాయం ప్రకటిస్తారని ఆశించారు. అయినా ఫలితం లేకుండా పోయింది.

### రూ.23 కోట్లు విడుదల

కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చాక గతేడాది మేలో రూ.23 కోట్లు రైతులకు పరిహారం చెల్లించేందుకు విడుదల చేసింది. దాంతో ప్యాకేజీ 22 పనులపై మళ్లీ రైతుల్లో ఆశలు చిగురించాయి. అయితే తర్వాత ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. సాగునీటి ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌లో రూ.22,615 కోట్లు కేటాయించడంతో ప్యాకేజీ 22 పనులకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిధులు విడుదలై పనులు పూర్తయితే కామారెడ్డి నియోజకవర్గంలో 80 వేల ఎకరాలు, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 30 వేల ఎకరాలు, బాన్సువాడ నియోజకవర్గంలో 12 వేల ఎకరాలకు సాగు నీరందనుంది.

### పూర్తికాని భూ సేకరణ

కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో రూ.1400 కోట్ల వ్యయంతో ప్రాణహిత చేవెళ్ల పథకానికి శ్రీకారం చుట్టారు. ప్యాకేజీ 20, 21, 22 కింద పనులు చేపట్టింది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కాళేశ్వరం పేరుతో డిజైన్ మార్చి పనులు చేపట్టింది. పనులకు రూ.200 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇప్పటికి పూర్తిస్థాయిలో భూ సేకరణ చేపట్టలేదు. భూంపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మించారు. యాచారం వద్ద భారీ సొరంగం నిర్మించారు. ఆ పనులు అక్కడే నిలిచిపోయాయి.



## డిప్యూటీ సీఎం కుమారుడి వివాహానికి ఎమ్మెల్యే హాజరు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య-సాక్షి వివాహం హైదరాబాద్‌లో జరిగింది. కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు ఆశీస్సులు అందజేసి, వారి దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, అడ్లూర్ లక్ష్మణ్, శాసన మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పాల్గొన్నారు.



## విద్యార్థుల సమస్యలపై ఎమ్మెల్యే మౌనమేలా..?

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అసెంబ్లీలో విద్యార్థుల సమస్యలపై ఎమ్మెల్యే మదన్ మోహన్ ఎందుకు మౌనం వహించారని ఏబీవీపీ నాయకులు ప్రశ్నించారు. ఈ మేరకు పట్టణంలో ఏబీవీపీ నాయకులు మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటులో విద్యార్థులు ఎంతో కీలక పాత్ర పోషించారన్నారు. ఎంతో మంది విద్యార్థుల బలిదానాలతో తెలంగాణ తెచ్చుకుంటే.. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో వారికి అరకొర నిధులిచ్చి అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పక్క రాష్ట్రాలను చూసి సిగ్గు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకట్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో ఇందూరుపై కాంగ్రెస్ సర్కారు వివక్ష: దినేష్ కులాచారి

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** బడ్జెట్‌లో ఇందూరుపై కాంగ్రెస్ సర్కారు వివక్ష చూపిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆరోపించారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్యారంటీల పేరుతో గద్దెనెక్కి.. ఇప్పుడు ఆ 'ఆరు గ్యారంటీల'ను పాతాళంలో పాతేసిన దగాకోరు బడ్జెట్ ఇది అని విమర్శించారు. పేదలను నట్టేట ముంచి, సకల జనులను నిరాశలో నెట్టేసిన బడ్జెట్‌ను ప్రజలు ఆమోదించడం లేదన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు. బడ్జెట్‌లో గల్ఫ్ బాధితులకు చిల్లిగవ్వ కేటాయించకపోవడం వారిని ద్రోహం చేయడమేనన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోపు చక్కెర కర్మాగారాలను తెరిపిస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి.. ప్రస్తుత బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం జిల్లా రైతాంగాన్ని మోసం చేయడమేనని దినేష్ ఆరోపించారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు రూ.1,500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1,000 కోట్లు ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం.. నిజామాబాద్‌లోని 'తెలంగాణ యూనివర్సిటీ' అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. బడ్జెట్‌లో ఆదిలాబాద్ విమానాశ్రయం గురించి ప్రస్తావించిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జక్రాన్‌పల్లి విమానాశ్రయాన్ని ఎందుకు పట్టించుకోలేదన్నారు. ఈ బడ్జెట్ ఇందూర్ జిల్లా రైతాంగాన్ని తీవ్ర నిరాశకు



గురిచేసిందన్నారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టులోని ప్యాకేజీ 21, 22 పనులకు, అలాగే మంచిప్ప (మాసాని) రిజర్వాయర్‌కు ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను నిరసిస్తున్నామని దినేష్ అన్నారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు 23న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, ఓం సింగ్ నాయక్, పుట్ట వీరేందర్, బొబ్బిలి వేణు, ఇందూర్ సుధ, గడ్డం రాజు, అంబదాస్ రావు, ఆనంద్ విజయ్ కృష్ణ, ఆనంద్, బుల్లెట్ శీను తదితరులు పాల్గొన్నారు.

## షబ్బీర్ అలీకి రంజాన్ శుభాకాంక్షలు

**అక్షరటుడే, కామారెడ్డి:** రంజాన్ సందర్భంగా పట్టణంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎస్పీ రాజేష్ చంద్ర పాల్గొన్నారు. బందోబస్తును పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీతో పాటు కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి దంపతులు శుభాకాంక్షలు తెలిపారు.



## రుణాల చెల్లింపులను నిర్లక్ష్యం చేయవద్దు

**అక్షరటుడే, గాంధారి:** డ్వాక్రా రుణాల చెల్లింపులో నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వం అందించే పలు ప్రయోజనాలను పొందలేకపోతారని అడిషనల్ డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. గాంధారి మండలంలోని నేరల్ తండా గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు రివాల్వింగ్ ఫండ్ బ్యాంకు నుంచి పొందిన రుణాలను సరైన పద్ధతిలో చెల్లించాలని సూచించారు. కొన్ని పొదుపు సంఘాలు లోన్లు తీసుకుని సరైన సమయంలో తిరిగి చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. సరైన పద్ధతిలో రుణాలు తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్ నాయక్, ఉపసర్పంచ్ నెహ్రూ నాయక్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పుష్పరాణి, క్లస్టర్ సీసీ తదితరులు పాల్గొన్నారు.







నగరంలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



# ఘనంగా రంజాన్ వేడుకలు

ఉమ్మడి జిల్లాలో రంజాన్ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఖురాన్ సందేశాన్ని వినిపించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్




నగరంలో మేయర్..










పెద్ద కొడప్‌గల్ మండలంలో..



ముప్కాల్ మండల కేంద్రంలో..




పిట్లంలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే తోట



నందిపేట్ మండలం వెల్మల్‌లో..



ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రామంలో..



కోటగిరిలో..



ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు ఫయాజ్



ఆర్మూర్ ఈద్గాలో..



ఎల్లారెడ్డిలో..



గాంధారిలో..



## వేంపల్లిలో క్రీడాకారులకు క్రీడాసామగ్రి పంపిణీ

**అక్షరటుడే, ముప్కాల్:** వేంపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలోని క్రీడాకారులకు క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లను సర్పంచ్ ఎట్టెం మహేష్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా యువత క్రీడల్లో ముందుకు రావాలని, ఆరోగ్యకరమైన జీవనశైలికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రెంజర్లలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ బొమ్మెన లావణ్య భూమేశ్వర్ ప్రారంభించారు. రోడ్ల అభివృద్ధి కోసం పనులు ఉపయోగపడతాయని, ప్రజలకు సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో పనులు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేందర్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ముత్యం రెడ్డి, చిన్నరెడ్డి, ఆకుల రమేష్, ఆకుల రాజన్న, గంగాధర్, షరీఫ్, నవీన్, జనర్ధన్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఫతియొద్దీన్



**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రానికి చెందిన ఎండీ ఫతియొద్దీన్‌ను కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోకుల్ సాయిరాం, సేవ్యా నాయక్, శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజయ్య ఫతియొద్దీన్‌ను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హర్షత్, రహీం, మునీర్, షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.



# బీర్కూర్‌లో కలుషిత తాగునీరు..

- ప్రజల ఆరోగ్యంతో అధికారుల చెలగాటం
- కాలనీవాసుల ఆగ్రహం

**బీర్కూర్ మండల కేంద్రంలోని ఇందిరా కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వారం రోజులుగా కాలనీలో పూర్తిగా కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.** - అక్షరటుడే, బీర్కూర్

తాగునీటిలో మట్టి, మురుగు రావడంతో డ్రెయినేజీ నీటిని తలపిస్తోందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల నీటిలో పురుగులు కూడా కనిపిస్తున్నాయని చెబుతున్నారు. ఈ నీటిని వినియోగించడం వల్ల జ్వరం, చర్మవ్యాధులు, ఒళ్లంతా దురద వంటి సమస్యలు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. తాగడానికి మాత్రమే కాకుండా రోజువారీ అవసరాలకు కూడా ఈ నీటిని వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### ఇందిరాకాలనీలో..

ఇందిరా కాలనీలో తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతిన్నాయా? లేక డ్రెయినేజీ నీళ్లు నేరుగా కలుస్తున్నాయా అనేది తెలియడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో అధికారులు చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్లను పరిశీలించి శుద్ధమైన తాగునీరు సరఫరా చేయాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.

